మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ఈ నెల 23న అలంపూర్ ఆలయాలకు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అలంపూర్ లోని హెలిపాడ్ నుంచి ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏమైనా ప్రమాదకరంగా ఉంటే వాటిని సరి చేయించాలని సూచించారు. అలంపూర్ పట్టణ ప్రధాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక సంఘం అధికారులకు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథి మర్యాదలు చేయాలని, ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. పోలీసుల గౌరవ వందనం, తమ శాఖ నుంచి చేయాల్సిన ఇతర అన్ని ఏర్పాట్లను పర్యవేక్షి స్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఎలెక్టర్ మ్యాపింగ్ వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

## ఎలెక్టర్ మ్యాపింగ్ పరిశీలన

**నారాయణపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఉట్కూరు తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని ఎలెక్టర్, ప్రాజెనీ మ్యాపింగ్ వివరాలను తహసిల్దార్ చింత రవి, బూత్ లెవెల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిని సమీక్షించి, నిబంధనల ప్రకారం ఖచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రైతుల నమోదు (ఫార్మర్ రిజిస్ట్రేషన్) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో కిషోర్ కుమార్, వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు.



శకటోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

## ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

### ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో మానవులుగా జన్మించిన ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. మంగనూరు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భగవంతుడి సేవ చేయాలని, తద్వారా మోక్షం లభిస్తుందని వివరించారు. దైనందిన జీవితంలో ప్రార్థన, యోగా, ధ్యానం, లేదా సత్సాంగత్యం ద్వారా ఆధ్యాత్మికతను అలవర్చుకోవడం వల్ల ఉన్నతమైన జీవితాన్ని, భగవంతునితో అనుసంధానాన్ని పొందవచ్చు అని తెలిపారు. ఆధ్యాత్మిక చింత నమానసిక ప్రశాంతతను, ఒత్తిడి నుండి విముక్తిని కలిగిస్తూ, జీవితంలో ధర్మబద్ధమైన మార్గంలో నడవడానికి సహాయపడుతుంది అని వివరించారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శకట ఉత్సవంలో పాల్గొని ఎద్దుల బండిపై ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలం నాగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, మల్లికార్జున్ రెడ్డి, మాజీ జడ్పిటిసి పరశురాములు, తిరుపాల్, మేకల మాసయ్య, కృష్ణారెడ్డి , సత్యశీల సాగర్ ,దస్తగిరి, రామన్ గౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.



స్కూల్ బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్

## గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

### బిజ్వార్ జడ్పీ పాఠశాలలో ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించిన కలెక్టర్

**నారాయణపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు సురక్షితంగా, సకాలంలో పాఠశాలకు చేరుకునేందుకు ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సేవ ఒక వరమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలకు అంబాత్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ రూ.40 లక్షల వ్యయంతో బస్సును అందజేశారు. శనివారం కలెక్టర్, స్వామీజీతో కలిసి బస్సును ప్రారంభించారు ఈ బస్సు ద్వారా కొత్తపల్లి, పాతపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన 63 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై మంచి విద్యను అభ్యసించాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యం విద్యాభివృద్ధికి ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. తరచూ గైర్హాజరు వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. స్వామీజీ మాట్లాడుతూ తాను -మిగతా4లో..

# తెలంగాణ సర్కార్‌లో క్రీడలకు పెద్దపీట

- ఉన్నత విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలి
- క్రీడల అభివృద్ధి కోసం రూ.760 కోట్లను కేటాయించిన ప్రభుత్వం
- క్రీడలతో అంతర్జాతీయ గుర్తింపు పొందవచ్చు
- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి




సియం కప్ క్రీడల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మెగా రెడ్డి

**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం రూ.760 కోట్లను కేటాయించిందని, ఉన్నత విద్యతోపాటు అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. సీఎం కప్ రెండో ఎడిషన్ క్రీడా పోటీల్లో భాగంగా శనివారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న సెపక్‌త్రా రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తికి ఒక ప్రత్యేకత ఉందని ఇదే పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆటలాడారని ఆయన గుర్తుచేశారు. విద్యా పర్తిగా పేరున వనపర్తి నేడు క్రీడలపర్తిగా మారుతోందని ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ రాష్ట్రం కంటే చిన్న చిన్న దేశాలే బంగారు పతకాలు సాధిస్తుంటే భారతదేశ వెనుకబడిపోతుందని, అలాంటి దేశంలో తెలంగాణ రాష్ట్రం క్రీడల పరంగా ముందుండేలా చేసేందుకే ముఖ్యమంత్రి, క్రీడల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారని వసతి గృహాల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు మేస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలను పెంచుకోవడంతో పాటు సన్న బియ్యం పంపిణీ చేపడుతుందని అన్నారు. క్రీడలతో మానసికోలాసంతో పాటు దేశదారుడెం పెంపొందితోందని, ప్రతి ఒక్కరు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సెపక్‌త్రా జిల్లా అధ్యక్షులు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ మాధవి రమేష్, వైస్ ఛైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు, జిల్లా క్రీడా శాఖ అధికారులు, క్రీడాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**దివ్యాంగులకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు...**



దివ్యాంగులకు స్కూటీలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీలో భాగంగా 40 ఉచిత త్రిచక్ర స్కూటీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి హాజరై లబ్ధిదారులకు స్కూటీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. స్వయం ఉపాధి, విద్య, ఉపాధి అవకాశాల కోసం రవాణా సౌకర్యం చాలా అవసరమని, ఈ త్రిచక్ర స్కూటీలు వారికి రోజువారీ జీవనంలో పెద్ద ఉపశమనం కలిగిస్తాయని పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ వాహనాలను జాగ్రత్తగా వినియోగించుకొని స్వావలంబన సాధించాలని సూచించారు. ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలో ముందంజలో ఉందని తెలిపారు. సమాజంలో వారు ఇతరులపై ఆధారపడకుండా స్వతంత్రంగా జీవించేందుకు ఈ విధమైన కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. అవసరమైన వారికి మరిన్ని సౌకర్యాలు అందించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వనపర్తి జిల్లాలో దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే ఈరోజు అర్హులైన దివ్యాంగులకు 40 త్రి చక్ర స్కూటీలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రజాప్రతినిధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



కల్వకుర్తి ఏడీఏ కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

## ఏడీఏ కిరణ్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు

### ఏక కాలంలో 7 చోట్ల దాడులు

### కల్వకుర్తి ఏడిఏ కార్యాలయంలో కిరణ్ కుమార్‌పై జరుగుతున్న ఏసీబీ సోదాలు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తిలో అగ్రికల్చర్ డిపార్ట్మెంట్‌లో సుందరి కిరణ్‌కుమార్ ఏడీఏగా పనిచేస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తడంతో సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఏసీబీ డి.ఎస్.పి బాలకృష్ణ తెలిపారు. ఆయన స్వస్థలమైన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో ఏసీబీ అధికారులు ఉదయం దాడులు నిర్వహించారు. కిరణ్ కుమార్ ఇంటితోపాటు ఆయన బంధువుల ఇండ్లలో సోదాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏసీబీ అధికారులు ఏకకాలంలో 7చోట్ల దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఆయనకు పార్ట్నర్ షిప్ ఉన్న నేరేడుచర్ల మండలంలోని చిల్లేపల్లి గ్రామశివారులోని అవని రైస్ మిల్లులో కూడా అధికారులు దాడులు నిర్వహించారు. పొనుగోడు, నేరేడుచర్లతో పాటు కల్వకుర్తిలో ఆయన పనిచేస్తున్న ఆఫీస్‌తో పాటు గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి గ్రామంలోని ఆయన అత్తగారింట్లో, అనంతగిరి మండలంలోని అమీనాబాద్, అలాగే సూర్యాపేటలోని ఆయన నివాసం ఉంటున్న కిరాయి ఇంట్లో, రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని కిరాయి ఇంట్లో సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీలు చేస్తోన్న సమయంలో కిరణ్ కుమార్ పోనుగోడులోనే ఉన్నారు. దర్యాప్తు కోసం ఏసీబీ అధికారులు ఏడిఏ కిరణ్ కుమార్‌ను వెంట తీసుకువెళ్లారు. దర్యాప్తు పూర్తయ్యాక వివరాలన్ని మీడియాకు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఖదీర్ తదితరులు ఉన్నారు.



ప్రకృతి వనంలో చెట్లను తొలగించిన దృశ్యం

## పల్లె ప్రకృతి వనంపై పంజా

### 200 చెట్లకు పైగా తొలగించిన వైనం

### ఏ అధికారికి సమాచారం లేదు అనుమతి అసలే లేదు

### ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు పొందిన దేవరకద్ర మండలం జీనుగురాలలో ఘటన

### విచారణ చేపడతాం అంటున్న ఫారెస్ట్ అధికారులు

**దేవరకద్ర, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలోని జీనుగురాల గ్రామం పల్లె ప్రకృతి వనంలో చెట్లను తొలగించిన ఘటన జిల్లాలో చర్చనీయాంశం అయింది. ఇటు ఫారెస్ట్ అధికారులకు అటు రెవెన్యూ అధికారులకు సమాచారం లేకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు తమ ఇష్టారీతిగా పల్లె ప్రకృతి వనంలోని చెట్లను తొలగించడం పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పల్లె ప్రకృతి వనంలో సుమారు 200 గజాల జాగా వరకు అంగన్‌వాడి కేంద్రం కోసం కేటాయించగా, ఆ పనులు ఇంకా ఆదిలోనే ఉన్నాయి. తాజాగా శనివారం -మిగతా4లో..

## పనుల్లో వేగం పెంచాలి

### లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరల పంపిణీ

### అంకిరావుపల్లిలో అభివృద్ధి పనులపై సమీక్షించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం కొల్లాపూర్ మండలం అంకిరావుపల్లి గ్రామంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలోని పలువార్డులను పరిశీలించి, స్థానికులతో ముఖాముఖి చర్చించారు. గ్రామ స్థాయిలో విద్య, వైద్యం, విద్యుత్ సరఫరా, వ్యవసాయం, ఆర్టీసీ బస్సుల సౌకర్యం వంటి మౌలిక వసతులపై మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు.



ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న మంత్రి

ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రఘుపతిరావు, నాగరాజు, వెంకటస్వామి, రాజశేఖర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

**క్యాంపు కార్యాలయంలో మండలాల వారీగా సమీక్ష....**

అంకిరావుపల్లి పర్యటన అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కాసేపట్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. భూ సమస్యలు, అటవీ అనుమతులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో ఎదురవుతున్న అడ్డంకులపై చర్చించడం జరిగింది.

# అగ్నికి ఆహుతైనా డ్రిప్ ఫ్యాక్టరీ

**అయిజ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :** పట్టణ సమీపంలోని రాయచూరు రోడ్ దగ్గర గల పరమేశ్వర ఇండస్ట్రీ అనే డ్రిప్ ఫ్యాక్టరీ శనివారం ఉదయం అకస్మాతూగా జరిగిన అగ్ని ప్రమాదంలో అగ్నికి ఆహుతి అయింది. దీంతో ఫ్యాక్టరీలో ఉన్న డ్రిప్పు పైపులు డ్రిప్పు లాటరీ పైపు చుట్టలు డ్రిప్పు తయారు చేసే మిషనరీ వ్యవస్థ దానికి సంబంధించిన మెటీరియల్ మొత్తం అగ్నికి ఆహుతి ఐ మూడు కోట్ల విలువైన సామాగ్రి దహనం అయిపోయింది. ఈ సంఘటన బాధితుల నూ కంటతడి పెట్టించింది. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సంఘటన స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోట్లకు విలువైన ఫ్యాక్టరీ అగ్నికి ఆహుతి కావడం చాలా బాధాకరమని సంబంధిత ఫ్యాక్టరీ యజమాని ప్రతాపరెడ్డి కిందిస్థాయి నుంచి ఈ స్థాయి వరకు అంచెలంచలు ఎదుగుతూ ఫ్యాక్టరీ నిర్మించుకొని రైతులకు కావాల్సిన డ్రిప్పు పరికరాలను అందిస్తున్న తరుణంలో కష్టపడి నిర్మించిన ఈ ఫ్యాక్టరీ అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరమని అన్నారు. అయితే పట్టణ సమీపంలోనే ఈ ఘటన జరిగిన ఫైర్ స్టేషన్ లేకపోవడంతో పూర్తిస్థాయిలో అగ్నికి ఆహుతి అయిందని అదే పట్టణంలో ఫైర్ స్టేషన్ ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదని అన్నారు. ఈ విషయం



దహనం అవుతున్న ఫ్యాక్టరీ మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఇప్పటికన్నా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐజ పట్టణానికి ఫైర్ స్టేషన్ శాంక్షన్ చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏలాంటి సహాయ సహకారాలు ఉన్న సహకరిస్తామని ఫ్యాక్టరీ యజమానికి హామీ ఇచ్చారు. అంతకుముందు సమాచారం అందుకున్న పోలీస్ సిబ్బంది ఫైర్ ఫైర్ సిబ్బంది సుమారు నాలుగు గంటలసేపు నిరంతరంగా కష్టపడుతూ మంటలను అదుపులోకి తెచ్చారు.

### మూడు కోట్ల విలువైన సామగ్రి మిషనరీ వ్యవస్థ దహనం

### సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



ఫైర్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సమీపంలో నీరు అందుబాటులో లేకపోయినా ట్యాంకర్ల ద్వారా మరియు ఫైర్ ట్యాంకర్ల ద్వారా నీరు తెస్తూ నిరంతరం కష్టపడి అత్యంత చాకచక్కగా మంటలకు మంటలను అదుపులోకి తెచ్చినందుకు వారికి బాధిత కుటుంబంతో పాటు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అయితే అప్పటికే ఫ్యాక్టరీ పూర్తిస్థాయిలో అగ్ని ఆహుతి అయిపోయింది.

## మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య


బొప్పటి రమేష్ (ఫైల్)

**నవాబుపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో భార్య చెప్ప కుండా తల్లిగారింటికి వెల్లిందని మనస్థాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకు న్న ఘటన మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై విక్రం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బొప్పటి రమేష్ (32) భార్య మానస,తండ్రి చిన్న వెంకటయ్యలు ఈ నెల 18న బుధవారం, రాత్రి రమేష్ తల్లి తండ్రి గొడవ పడుతుండగా, రమేష్ జోక్యం చేసుకొని ఇరువురిని అదుపు చేసే క్రమంలో రమేష్ అమ్మ నాన్నలు రమేష్ ను మందలించారు. అది చూసిన రమేష్ భార్య మానస ఆవేశంలో మరుసటి రోజు గురువారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోవడంతో, శుక్రవారం రాత్రి వరకు కూడా భార్య తిరిగి రాకపోవడంతో మనస్థాపానికి గురైన బొపటి రమేష్, శనివారం తెల్లవారుజామున ఇంట్లో తన గదిలో తలుపు గడియ పెట్టుకొని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి చిన్న వెంకటయ్య తల్లి కుమారిని డోర్ కొట్టగా ఎంతకు తీయక పోవడంతో తలుపులు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి చూడగా అప్పటికే చనిపోయాడని తెలుసుకున్న చిన్న వెంకటయ్య పోలీసులకు సమాచారం ఇవ్వగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## హైస్కూల్‌లో ప్యూర్ ఫైడ్ వాటర్ ఫిల్టర్ ప్రారంభం


కంసానిపల్లి హైస్కూల్‌లో సర్పంచ్ చేతుల మీదుగా ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్ ప్రారంభం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండలంలోని కంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ ప్యూరీ ఫైడ్ వాటర్ ఫిల్టర్ ప్రారంభించారు. కమ్యూనిటీ ప్యూరి ఫైడ్ ఫిల్టర్‌ను సిపిడబ్ల్యూ అనే స్వచ్ఛంద సంస్థ వారు అందించిన ఫిల్టర్‌ను మండల విద్యాధికారి చంద్రశేఖర్ శనివారం ప్రారంభించారు. దీంతో పాఠశాల విద్యార్థులు ప్యూరిఫైడ్ వాటర్ తాగాలని, పాఠశాలలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయమని ఎంఇఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి చంద్ర శేఖర్, పాఠశాల ఇంఛార్జి హెచ్‌ఎం మేడిపూరి మల్లికార్జున్, గ్రామ సర్పంచ్ సిమర్ల లలితమ్మ, ఉప సర్పంచ్ పోల జితేందర్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్ట శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు కట్ట మల్లారెడ్డి, భాగ్యరేఖ, మహేశ్వరి, కట్ట ప్రభాకర్ రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

**పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కె. హర్షవర్ధన్**



మాట్లాడుతున్న జిల్లా ఉపాధ్యక్షులు కె. హర్షవర్ధన్

**దేవరకద్ర, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో దేవరకద్ర మండల కేంద్రంలోని భవిత డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షులు కె.హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు అన్ని పరీక్ష కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో త్రాగునీరు, టాయిలెట్స్, వైద్య సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. పరీక్ష కేంద్రాల్లో ఫ్యాన్లు, ఫర్నిచర్‌తో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని విద్యార్థులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలని అదేవిధంగా రవాణా ఇబ్బంది లేకుండా సమయానికి ఆర్టీసీని నడిపించే విధంగా జిల్లా అధికారులతో చర్చించుకోవాలని అన్నారు. విద్యార్థులు సరైన సమయానికి సెంటర్ దగ్గరికి చేరుకోవాలని ఇన్విజిలేటర్లు ఇచ్చిన సూచనలు సలహాలు విద్యార్థులు తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో నందిని ,అనూష, అరవింద్, రాము, కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రానికి చెందిన గుంపర్ పల్లి గట్టయ్య మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు గ్రామ కాంగ్రెస్ నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే తుడిమేగారెడ్డికి తెలపగా ఆ కుటుంబానికి నేనున్నానంటూ భరోసా ఇస్తూ వారికి ఆర్థిక సహాయంగా రూ.5000 లను ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులకు తెలుపగా వారు మృతుని కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసనిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఎప్పుడు అండగా ఉంటుందని తెలుపుతూ మృతుని కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి చర్ల శ్రీహరి, టౌన్ ప్రెసిడెంట్ గోవిందు,రామచంద్రయ్య యాదవ్,విష్ణు ముదిరాజ్,అబ్దుల్ సమీర్, రాజ వర్ధన్, వెంకటయ్య,రవి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## పిఎం శ్రీ పాఠశాలలో పిటిఎం సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉప్పునుంతల పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శని వారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యా యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ పాఠశాల రాజస్వ ప్రధా నోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొ న్నారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రాణాళిక బద్ధంగా చదవాలని, విద్యార్థులపై ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధ తల్లిదండ్రులు వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థి యొక్క విద్య సామర్థ్యాలు , హాజరుపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో చర్చించారు. అదేవిధంగా పాఠశాలలో అమలవుతున్న డిజిటల్ తరగతులు, అత్యాధునిక మౌలిక వసతుల గురించి విద్యార్థుల తల్లిదం డులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల క్రమశిక్షణతో పాటు, మానసిక, శారీరక ఆరోగ్యం పై తీసుకోవాల్సి న జాగ్రత్తలపై చర్చించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శభాష్ జిఎంఆర్

**మూడు మున్సిపాలిటీలో విజయం**

**దేవరకద్ర ఎమ్మెల్యే కు ముఖ్యమంత్రి అభినందనలు**


ఎమ్మెల్యే జిఎంఆర్‌ను అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

**దేవరకద్ర, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, కొత్తకోట, భూత్పూర్, మూడు మున్సిపాలిటీ కేంద్రంలోని మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చైర్మన్ లను కైవసం చేసుకోవడంతో ఎమ్మెల్యేను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనితీరును ప్రశంసించిన సీఎం, శభాష్ జిఎంఆర్ అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజలకు చేరువగా ఉంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరడం దేవరకద్ర ఎమ్మెల్యే నాయకత్వానికి నిదర్శనమని తెలిపారు. మూడు మున్సిపాలిటీలో పార్టీ విజయంతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొనగా, రాబోయే రోజుల్లో మరింత ప్రజా సేవకు కట్టుబడి పని చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ విజయాన్ని ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీలు అభివృద్ధి సాధ్యం

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి**


బిజెపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి

**అమరచింత ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాలతో పాటు మున్సిపాలిటీలు అభివృద్ధి చెందుతాయని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి అన్నారు. శనివారం అమరచింత మండలంలోని చంద్రఘడ్, ధర్మాపూర్ గ్రామాలలో బంగ్లా లక్ష్మీకాంతరెడ్డి సొంత నిధులతో ఏర్పాటుచేసిన హైమాక్స్ లైట్లు ను ప్రారంభించారు. ఎన్నికల సందర్భంగా ఆయా గ్రామాలకు ఇచ్చిన హామీ మేరకు ఆయా గ్రామాల ప్రజలను కోరిక నెరవేర్చమని ఆయన అన్నారు. అలాగే ధర్మపురి, చంద్ర గడి గ్రామాల ప్రజలు బంగ్లా లక్ష్మీకాంతరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఇటీవల మున్సిపల్ ఎన్నికలలో బిజెపి పార్టీకి చెందిన ఎం రాజు, వేద విష్ణు, పారుపల్లి ఉషన్న కౌన్సిలర్గా విజయం సాధించిన సందర్భంగా అమరచింత మండల బిజెపి రూరల్ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణం పల్లి గ్రామంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరచింత మున్సిపాలిటీలో బిజెపి పార్టీకి చెందిన ముగ్గురు


విజయం సాధించిన ముగ్గురు కౌన్సిలర్లు సన్మానిస్తున్న బిజెపి నాయకులు

కౌన్సిలర్లు ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని ఆయన వారిని కోరారు. అమరచింత మున్సిపాలిటీలో పాలమూరు ఎంపీ డీకే అరుణ నీటి కొరత లేకుండా ముందు జాగ్రత్తగా అమృత్ పథకం ద్వారా మున్సిపాలిటీ ప్రజలకు త్రాగునీరు అందిస్తున్నామని ఆయన అన్నారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, బిజెపి మండల అధ్యక్షులు మల్లారెడ్డి సర్పంచ్, చంద్ర నాయక్ సర్పంచ్ కృష్ణ నాయక్, బిజెపి పట్టణ అధ్యక్షురాలు మంగ లావణ్య, బిజెపి మండల కార్యదర్శి సురేందర్, బిజెపి నాయకులు తిరుమల రఘు, బిజెపి సీనియర్ నాయకులు హరీష్, మంగ ఆంజనేయులు, కౌన్సిలర్లు రాజు, ఉషన్న, విష్ణు తో పాటు బిజెపి మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమెరికా సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లుతున్న మోది ప్రభుత్వం



మాట్లాడుతున్న సిపిఎం మద్దూర్ ఏరియా కార్యదర్శి గోపాల్

**దామరగిద్ద, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** సిపిఎం దామరగిద్ద మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ మండల కార్యదర్శి అంజిలయ్య అధ్యక్షతన నిర్వహించిన రెడ్ బుక్ డే" కార్యక్రమంలో బరితెగించిన అమెరికా సామ్రాజ్యవాదం" అనే పుస్తకంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మద్దూర్ ఏరియా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం సుంకాల పేరుతో ప్రపంచ దేశాలను బెదిరింపులకు గురిచేస్తోందని విమర్శించారు. లాటిన్ అమెరికా దేశాలపై దాడులు జరుపుతూ వేనేజులా అధ్యక్షుడు నికల్స్ మధురో ఆయన కుటుంబంపై చర్యలు తీసుకోవడం ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ అమెరికా చర్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడం సిగ్గుచేటని అన్నారు. మన దేశంపై సుంకాలు విధించి హెచ్చరికలు జారీ చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఇతర దేశాలు అయిన రష్యా, చైనా, నార్త్ కొరియా, కెనడా వంటి దేశాలు తమ ప్రయోజనాలను కాపాడుకునే విధంగా ప్రతిస్పందిస్తుంటే, భారత్ మాత్రం మౌనం పాటిస్తోందని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్యవాదానికి తలొగ్గుతూ దేశ ప్రయోజనాలను, ప్రతిష్ఠను తాకట్టు పెడుతోందని విమర్శించారు. సామ్రాజ్యవాద దురాగతాలను ప్రజలు వ్యతిరేకించాలని, వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకొని చైతన్యవంతులవ్వాలని, ఈ పుస్తకం అందుకు దోహదపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు అశప్ప, సిఐటియు మండల కార్యదర్శి జోషి, సిపిఎం నాయకులు శివకుమార్, భీంషప్ప, మోహన్, కేశవులు, విజయ్ బాబు, ప్రకాష్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలుంటే నేరుగా సమాచారం ఇవ్వండి : విద్యుత్ డిఈఈ


సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న విద్యుత్తు ఉన్నతాధికారులు

**ఉప్పునుంతల,ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఏర్పడిన సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని నాగర్‌కర్నూల్‌జిల్లా విద్యుత్ డిఇఇ శ్రీధర్ శెట్టి సూచించారు. ఈనెల 18న వార్త దినపత్రికలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడి ఎండిపోతున్న పంటపొలాలు "అనే శీర్షిక రావడంతో స్పందించిన విద్యుత్తు ఉన్నతాధికారులు శనివారం పర్యటించారు.విద్యుత్ అంతరాయం ఏర్పడిన పంట పొలాలను విద్యుత్ డిఇఇ శ్రీధర్ శెట్టి పర్యటించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించారు. ఈ సీజన్ పూర్తి అయ్యేంతవరకు ఎక్కడ ఎండిపోకుండా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా క్రమబద్ధీకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మండలంలోని కంసానిపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ వారంలో విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. మండలంలోని రాయిచేడ్,తాడురు, కంసానిపల్లి గ్రామాలను వారు పర్యటించారు. ఈ సందర్భంగా డిఇఇ మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోకుండా విద్యుత్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని, ఎక్కడైనా సమస్యలు ఉంటే నేరుగా విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రైతులకు సూచించారు. అదేవిధంగా అనుమతులు లేకుండా ఎక్కడ విద్యుత్ వాడకూడదని, వ్యవసాయ పొలాల్లో సాగు చేసుకున్న పంటలను ధ్వంసం చేస్తున్న అడవి పందుల కోసం ఎక్కడ కూడా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయకూడదని రైతులకు సూచించారు. గ్రామాలలో విద్యుత్ స్తంభాలకు ఉన్న సపోర్టు తీగలను తగల కూడదని, రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రజా బాట కార్యక్రమంలో విద్యుత్తు డిఇఇ శ్రీధర్ శెట్టి, విద్యుత్ ఎడి ఆంజనేయులు,ఎఇ కొండల్, సీనియర్ లైన్ మెన్ నరేందర్,ఎఎల్ఎం వెంకటేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**ప్రీ క్వార్టర్ ఫైనల్ చేరిన నారాయణపేట జిల్లా మహిళల,పురుషుల జట్లు**


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** పల్లెల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి దేశానికి నైపుణ్యం గల క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రెండవ ఎడిషన్‌లో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ డిగ్రీ కళాశాల మైదానంలో నిన్నటి నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు మొన్న ప్రారంభం కాగా అర్ధరాత్రి వరకు మ్యాచ్‌లు కొనసాగాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 66 టీంలు సుమారు 1200మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటున్నారు. నారాయణపేట జిల్లాలో మొదటిసారిగా మక్తల్ పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈపోటీలు విజయవంతం కోసం నారాయణపేట జిల్లా యువజన క్రీడ సమైక్య ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆకట్టుకున్న నారాయణపేట జిల్లా మహిళ,పురుషుల టీంలు నారాయణపేట జిల్లా మహిళల, పురుషుల జట్లు ఆడిన మ్యాచ్ లను అద్భుతంగా ఆడి అన్ని ఆటలో ప్రత్యర్థ టీంలను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్ కు చేరుకున్నాయి. ఉత్కంఠభరితంగా జరుగుతున్న పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఆటగాళ్లను ప్రోత్సహించారు. మ్యాచ్ లను తిలకించడానికి వచ్చిన అభిమానుల కోసం గ్రౌండ్‌లో ప్రత్యేక ఏర్పాట్లను జిల్లా యూవజన క్రీడ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి వెంకటేష్ శెట్టి,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి,జిల్లాలోని పిడిలు నర్సిములు, రత్నయ్య,బాలరాజ్ గౌడ్, వెంకటప్ప, రామకృష్ణ రెడ్డి, అనంత సేన, ఊసు రవి,శ్రీధర్ గౌడ్, సాయినాథ్, మౌలాలి, రాజేశ్వరి, పరంజ్యోతి, రాజశేఖర్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్, ఈశ్వర్, నరేష్, రూప, స్వరూప, రేణుక, పర్వీన్ బేగం మిగితా పిఈటిలు పాల్గొన్నారు.

## నారాయణపేటలో బాలసదనం, వృద్ధాశ్రమం ఆకస్మిక తనిఖీ

**అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్**


వృద్ధాశ్రమం తనిఖీ చేస్తున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి

**నారాయణపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** తెలంగాణా రాష్ట్ర న్యాయ సేవా అధికారసంస్థ నారాయణపేటజిల్లా న్యాయ సేవాఅధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం నారాయణపేట పట్టణంలోని బాలసదనం వృద్ధాశ్రమాలను అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.అవినాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈసందర్భంగా న్యాయమూర్తి ఆశ్రమాలలో నివసిస్తున్న అనాథ పిల్లలు, వృద్ధులను నిర్వాహకులు సక్రమంగా చూసుకోవాలని సూచించారు. వారికి అవసరమైన మౌలిక సౌకర్యాలు, ఆరోగ్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. హాజరు పట్టికలను పరిశీలించి అందరూ హాజరై ఉన్నారా, ఎలాంటి సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. రోజువారీ ఆహార దినపత్రికను పరిశీలించి, నాణ్యమైన ఆహారం అందించాల్సిందిగా తెలిపారు. ఆహార ధాన్యాల నాణ్యత, త్రాగునీరు, పరిశుభ్రత, దినసరి వసతులను తనిఖీచేశారు.రిజిస్టర్లు,మూవ్‌మెంట్ రిజిస్టర్లు,సీసీటీవీ ఫుటేజ్,అడ్మిషన్లు ఆఫీస్ ఆర్డర్స్ ప్రకారం జరుగుతున్నాయా లేదా అన్న విషయాలను సమీక్షించారు.సంబంధిత అధికారుల ఆదేశాలమేరకు పిల్లలను అప్పగిస్తున్నారా లేదా అన్నది కూడా పరిశీలించారు. బాత్రూమ్, బెడ్‌రూమ్స్ శుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం పిల్లలకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

## టీఎన్జీవో అధ్యక్షుడికి తపస్ ఘన సన్మానం


టీఎన్జీఓ అధ్యక్షుడిని సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా టీఎన్జీవో అధ్యక్షులుగా ఎన్నికైన డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ నరసింహారెడ్డిని తెలంగాణ ప్రాంతం ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తపస్ నాయకులు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి షేర్ కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు నరసింహ, ఫ్యాక్టరీల అధికారులు నాగార్జున్ రెడ్డి, శ్రీనివాస్, సైన్స్ ఫోరం అధ్యక్షుడు కనకప్ప, కార్యదర్శి రాములు, సంజీవరెడ్డి, తపస్ దామరగిద్ద ప్రధాన కార్యదర్శి కరుణాకర్ పాల్గొన్నారు. అదేవిధంగా డీఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీకాంత్, కళ్యాణ్, శ్రీనివాస్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు.

## పాగుంట శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న గద్వాల మున్సిపల్ చైర్మన్


స్వామి వారిని దర్శించుకుంటున్న గద్వాల మున్సిపల్ చైర్మన్

**కెటిదొడ్డి ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన పాగుంట శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం జోగులాంబ గద్వాల మున్సిపల్ చైర్మన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి పాగుంట శ్రీ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.అర్చకుల అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి,తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, యుగంధర్ రెడ్డి ,సంజీవులు, దేవాలయం సిబ్బంది వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## జాతీయ కమిటీ పోటీలకు ఎంపికైన శివకృష్ణ



**ఆత్మకూర్ ఫిబ్రవరి 21,ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలం లోని మూలమల్ల గ్రామానికి చెందిన టి. శివ కృష్ణ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లుగా వనపర్తి జిల్లా కమిటీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 24 నుండి 27 వరకు వడోదరలో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు ఆత్మకూరు మండలానికి చెందిన క్రీడాకారుడు శివకృష్ణ ఎంపిక కావడం పట్ల కబడ్డీ అసోసియేషన్ నాయకులు పద్మజా రెడ్డి గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు తదితరులు క్రీడాకారుని ఘనంగా సన్మానించడమే కాకుండా ప్రత్యేకంగా అభినందించారు.

## వైద్య శిబిరం విజయవంతం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండలంలోని తిర్మాలపూర్ గ్రామంలో శనివారం ఉప్పునుంతల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామంలో దాదాపు 100 మంది కి వైద్య పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందికి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించడం జరిగింది వైద్య అధికారిణి డా. స్వప్న తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి డా. స్వప్న, గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్, ఉప సర్పంచ్ రాస మల్ల రేణయ్య, పంచాయతీ కార్యదర్శి అల్లాజీ, నాగేష్, వైద్య సిబ్బంది గ్రామస్తులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పల్లె దవఖానకు భూమి పూజ


మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్

**మల్దకల్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సహకారం తో మండల మహిళా సమాఖ్య భవనానికి,పల్లె దవఖానకు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ తూమ్ కృష్ణా రెడ్డి,మాజీ ఎంపిటీసి గోపాల్ రెడ్డి కలిసి గ్రామంలో భూమి పూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ డబ్బా రంగన్న వార్డు సభ్యులు నాగన్న, ప్రసాద్, వెంకట్ రాజా, సుధాకర్, పెద్దవెంకటన్న, వెంకట్ రాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వ్యవసాయ పంట పొలాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** రైతులకు విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా చూస్తామని నాగర్ కర్నూల్ జిల్లా విద్యుత్ డిఇఇ శ్రీధర్ శెట్టి తెలిపారు. శనివారం స్థానిక విద్యుత్ ఏఈ కొండల్ ఆధ్వర్యంలో తాడూరు సబ్ స్టేషన్ పరిధిలోని తాడూరు, రాయిచేడ్, కంసాని పల్లి గ్రామాలలో వారు విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కంసానిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసుకున్న రైతులకు విద్యుత్తు సరఫరా అంతరాయం లేకుండా అందిస్తామని, పంట పొలాలు ఎండిపోకుండా నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తామని డిఇఇ శ్రీధర్ శెట్టి అన్నారు. రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో విద్యుత్ డిఇఇ శ్రీధర్ శెట్టి, అచ్చంపేట ఎడిఇ ఆంజనేయులు,ఎంఇ కొండల్, గ్రామ సర్పంచ్ చీమర్ల లలిత, ఉప సర్పంచ్ పోల జితేందర్, శ్రీ ఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ కట్ట శేఖర్ గౌడ్, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

# గ్రామీణ బాలికల సాధికారతకు కేజీబీవీలు బలమైన వేదికలు

◆ నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి.అమరేందర్




సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి.అమరేందర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** గ్రామీణ బాలికలకు సమాన విద్యా అవకాశాలు కల్పించాలనే ప్రభుత్వ దృఢ సంకల్పానికి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీబీవీలు) బలమైన వేధికలుగా నిలుస్తున్నాయని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి.అమరేందర్ పేర్కొన్నారు. బాలికల సాధికారత, నాణ్యమైన విద్య మరియు ఉన్నత లక్ష్యాల సాధనలో కేజీబీవీలు కీలక పాత్ర పోషిస్తున్నాయనిఅదనపు కలెక్టర్ తెలిపారు. శనివారం నాగం కర్నూల్ జిల్లా ఐడీఓసీ ప్రధాన సమావేశ మందిరంలో ల్యూమినస్ లీగ్ ఆఫ్ కేజీబీవీలు, ప్రేరణ కార్యక్రమం, ఎస్సెసీ, ఇంటర్ విద్యార్థుల సన్మానోత్సవం, పూర్వ విద్యార్థులు మరియు ఉత్తమ ఉద్యోగుల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ పి. అమరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్‌కుమార్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్ తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులు సమయాన్ని వృధా చేయకుండా క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. నిరంతర శ్రమ, పట్టుదల, సమయపాలనతోనే ఉన్నత లక్ష్యాలనుసాధించవచ్చని తెలిపారు. విద్యార్థి దశలో అలవర్చుకున్న మంచి అలవాట్లు భవిష్యత్తులో గొప్పవిజయాలకు దారితీస్తాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, గురువుల ఆశలను నెరవేర్చేలా చదువుపై పూర్తి దృష్టి సారించాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్ మరియు పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఫలితాల సాధన దిశగా జిల్లా విద్యాశాఖ చర్యలు చేపడుతోందని, రానున్న ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో జిల్లాను ఆరో స్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్నట్లువెల్లడించారు. కేజీబీవీల్లో చదివిన పూర్వవిద్యార్థినులు ఎంబీబీఎస్ సహా ఉన్నత విద్యను అభ్యసించి, ప్రభుత్వ మరియు ప్రైవేట్ రంగాల్లో ప్రతిష్ఠాత్మక స్థానాలుపొందుతున్నారని తెలిపారు. కేజీబీవీలు బాలికలకు రక్షణ, ఆరోగ్యం, నాణ్యమైన విద్యా సదుపాయాలు, పోషకాహారం అందిస్తూ సమగ్ర అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కేజీబీవీల పర్యవేక్షణ అధికారిణి శోభారాణి మాట్లాడుతూ జిల్లాలోని 20 కేజీబీవీల్లో విద్యార్థినులకు అందిస్తున్న విద్యా, వసతి, సహపాఠ్య కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. పూర్వ విద్యార్థినుల విజయాలు ప్రస్తుత విద్యార్థినులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని తెలిపారు. కేజీబీవీల్లో విధులు నిర్వహించే ఉద్యోగస్తులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న వివిధ స్థాయి ఉద్యోగులను అదనపు కలెక్టర్ ప్రశంసా పత్రాలతో సత్కరించారు. పూర్వ విద్యార్థుల విజయగాథలు మరియు సిబ్బంది ప్రతిభ కేజీబీవీ విద్యార్థుల అభివృద్ధికి ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, సమగ్ర శిక్ష అభియాన్ ఫైనాన్స్ అధికారి మధుసూదన్‌రెడ్డి, మండల విద్యాధికారులు భాస్కర్ రెడ్డి, త్యాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారులు వెంకటయ్య, నూరుద్దీన్, శోభారాణి కిరణ్ కుమార్, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**దేవరకద్ర, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** అధికార, విపక్ష సభ్యులంతా, అసెంబ్లీకి హాజరైతే ఎంత అర్థవంతమైన చర్చలు సాగుతాయో మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. దేవరకద్ర మండల పరిధిలోని చౌదర్ పల్లి సమీపంలో ఉన్న కాకతీయ మోడల్ హై స్కూల్లో శనివారం పాఠశాల వారిఆధ్వర్యంలో మాక్ అసెంబ్లీ కార్యక్రమం నిర్వహించగా పాఠశాల విద్యార్థులు ప్రొటెం స్పీకర్‌గా బుష్రా, స్పీకర్‌గా శ్రీజ, ముఖ్యమంత్రిగా జ్ఞానేశ్వర్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రిగా నితిన్, సమాచార, సాంకేతికశాఖ మంత్రిగా మృణాళిని, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా అభీష్ట, క్రీడామంత్రిగా నందిని, వ్యవసాయశాఖ మంత్రిగా బుష్రా, రవాణా శాఖ మంత్రిగా పల్లవి, ఆర్థికశాఖ మంత్రిగా శ్రేష్ఠ, ఇతర విద్యార్థులు అధికార ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా పాల్గొన్నారు. అనంతరం కాకతీయ పాఠశాల కరస్పాండెంట్ గౌని రాయి రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే, రేపటి భావి పౌరులుగా మారనున్న తరుణంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగంపై అవగాహనతో సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా నడుచుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎలియాస్ కోలా, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## గుండాలలో భక్తులకు అన్నదానం

**వెల్దండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన గుండాల అంబరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో గత కొన్ని సంవత్సరాలుగా జియాగూడ యాదవ సంఘం అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కుల చిన్న జంగయ్య యాదవ్, మండల మహేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో జాతర కొనసాగుతున్న 15 రోజుల పాటు రామలింగేశ్వర స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాన్ని అందిస్తున్నారు. అదేవిధంగా దేవాలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తు ఉచిత అన్నదానంలో స్వీట్స్‌తో పాటు నాణ్యతమైన భోజనం భక్తులకు అందిస్తుండడంతో భక్తులు నిర్వాహకులను అభినందిస్తున్నారు. కార్యక్రమంలో అన్నదాన నిర్వాహక సభ్యులు సింహారెడ్డి, శ్రీనివాస్, మల్లేష్‌యాదవ్, దేవేందర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## సిపిఎం ఆధ్వర్యంలో రెడ్ బుక్ డే



రెడ్ బుక్ డే నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో రెడ్ బుక్ డే నిర్వహించారు. 1848 ఫిబ్రవరి 21న కారల్ మార్క్స్, ఫ్రెడ్రిక్‌ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక వెలువడిన సందర్భంగా ఈ దినాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండమీది బాల్‌రామ్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థను సవాల్ చేసిన చారిత్రక పుస్తకమని అన్నారు. దోపిడీకిగురవుతున్న శ్రామిక జనవర్గాలకు ఇదిగొప్ప ప్రేరణనిచ్చిందని పేర్కొన్నారు. కార్మిక హక్కులు, ఎనిమిది గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి చట్టాల సాధనకు ఈ ప్రణాళిక పునాది అయిందన్నారు. ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అనే పిలుపు ఇప్పటికీ ప్రాసంగికమేనని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కే. కాశప్ప, గుండె గస్తప్ప, నరహరి, చుక్కా గోవిందు, గోటూర్ మల్లేష్, అంగడెల్లీ భాను ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధన్వాడ యువ రచయిత మొల్కమొల్ల బాలకృష్ణ గౌడ్‌కు సన్మానం



బాలకృష్ణ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ధన్వాడ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కవుల సంఘం–వేదిక, తెలంగాణ కవుల సంఘం–వేదిక, త్రివర్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు కవుల మహాసభలు శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ బృహత్తర కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు భాషా ఔన్నత్యం, కవుల బాధ్యతలపై దిశానిర్దేశం చేశారు. తెలుగు భాష ప్రపంచ వ్యాప్తం గా విస్తరిస్తోందని, మాతృభాష పరిరక్షణలో కవుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ధన్వాడ వాసి యువ రచయి త, రంగస్థల నటుడు మొల్కమొళ్ళ బాలక్రిష్ణ గౌడ్ (ఎం.బి. క్రిష్ణగౌడ్) తన రచనల ద్వారా తెలుగు భాషకు చేస్తున్న సేవలను గుర్తించి, ఆంధ్ర ప్రదేశ్ జానపద అకాడమీ తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. ప్రపంచ స్థాయి తెలుగు మహాసభల్లో ధన్వాడ నాడి వినిపించడంపై స్థానిక తెలుగు భాషాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఎం.బి. క్రిష్ణ గౌడ్ సాధించడం ధన్వాడకు గర్వకారణమని వారు అభినందించారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం



**గండీడ్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అంత్యక్రియలకు ఆర్థిక సాయం మండల పరిధిలో చేన్నాయపల్లి తాండ గ్రామసర్పంచ్ దశరథ నాయక్ నిరుపేద కుటుంబం అయినామాల అంజిలమ్మ (45) తన భర్త మా కిష్టయ్య గత కొన్ని సంవత్స రాల క్రిందట చనిపోయినాడు ఆమెకి పోషించే వారు లేక గతకొంత కాలంనుంచి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో చనిపోయిందని గ్రామస్తులు తెలుపగా విషయం తెలుసుకున్న సర్పంచ్ దశరథ్ నాయక్ గ్రామంలో లేకపోవడంతో ఉప సర్పంచ్ వార్డు మెంబర్ల ద్వారా 5000 వేలు అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో ఏసమస్య వచ్చినా గ్రామపంచాయతీ తరపునఅవసరమైన సహాయ సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భర్త దోమ శ్రీనివాస్ రెడ్డి. వార్డు మెంబర్ పీకేనాయక్. గ్రామస్తులు మొనే నాయక్. ధూపే నాయక్. లక్ష్మణ్ నాయక్. సురేష్. వెంకట్ రాములు. మాలా అంజి. మాలరాజు. ఎం ఆంజనేయులు. మాల కేశవులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్లిష్టమైన సెరిబెల్లార్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

వివరాలు వెల్లడించిన మలక్ పేట యశోద వైద్య బృందం



వివరాలు వెల్లడిస్తున్న మలక్ పేట యశోద వైద్య బృందం

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** అత్యంత క్లిష్టమైన సెరిబెల్లార్ ట్యూమర్ మెదడు శస్త్రచికిత్సతో మలక్ పేట్, యశోదా హాస్పిటల్స్ న్యూరో సర్జరీ వైద్యబృందం ఓ యువకుడి ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన పూర్తివివరాలు వెల్లడించారు. మెదడులోని సెరిబెల్లార్ ప్రాంతంలో ఏర్పడే క్లిష్టమైన గడ్డలు (ట్యూమర్లు) తీవ్రమైన నర సంబంధ సమస్యలకు కారణమవుతాయి. ఈ ప్రాంతం శరీర సమతుల్యత, కదలికల సమన్వయం, చూపు వంటి కీలక విధులను నియంత్రించే భాగం కావడంతో, ఇక్కడ ఏర్పడే గడ్డల వల్ల దీర్ఘకాలిక తలనొప్పులు, తల తిరగడం, చూపు మందగించడం, తరచూ వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి సాధారణంగా మెదడులో ఒత్తిడి పెరగడం, ముఖ్యమైన నర భాగాలపై ఒత్తిడి పడటంవల్ల కలుగుతాయి. ఇలాంటి క్లిష్టమైన పరిస్థితులను నిర్వహించడానికి సకాలంలో నిర్ధారణ, ఖచ్చితమైన న్యూరో ఇమేజింగ్, అధునాతన మైక్రో సర్జికల్ నైపుణ్యం, అలాగే శస్త్రచికిత్సకు ముందు తరువాత అప్రమత్తమైన క్రిటికల్ కేర్ అత్యంత అవసరం. ఇటీవల యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్‌లోని న్యూరోసర్జరీ వైద్య బృందం ఒక అత్యంత క్లిష్టమైన కేసులో 35 ఏళ్ల యువకుడికి విజయవంతంగా చికిత్స అందించిప్రాణాలను కాపాడింది. అతనికి ఎడమ వైపు సెరిబెల్లార్ స్పేస్ ఆక్యుపయింగ్ లెషన్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. తీవ్రంగా పెరుగుతున్న నర సంబంధ లక్షణాలతో బాధపడుతున్న ఈరోగికి అత్యవసర శస్త్రచికిత్స అవసరం కావడంతో సకాలంలో పూర్తి వైద్య మూల్యాంకనం, శస్త్రచికిత్సకు ఖచ్చితమైన ప్రణాళిక, సమగ్ర న్యూరో క్రిటికల్ కేర్ ద్వారా వైద్యులు గడ్డను సురక్షితంగా తొలగించి అత్యుత్తమ నర సంబంధ ఫలితాన్ని సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 35 ఏళ్ల యువకుడు శ్రీరాథ్లావత్ హరిలాల్, గత రెండు నెలలుగా తీవ్రమైన తలనొప్పి, తలతిరగడం, ఒక వారం నుంచి కుడి కంటిలో చూపు మందగించడం, వాంతులు వంటి సమస్యలతో 21న యశోదా హాస్పిటల్స్, మలక్‌పేట్‌లో చేరారు. బయట ఆసుపత్రిలో చేసిన ఎంఆర్ఐ మెదడు స్కాన్‌లో ఎడమ వైపు సెరిబెల్లార్ ప్రాంతంలో గడ్డ ఉన్నట్లు గుర్తించడంతో, తదుపరి చికిత్స కోసం యశోదా హాస్పిటల్స్‌కు రిఫర్ చేశారు. క్రిటికల్ కేర్ బృంద సహకారంతో విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స సమయంలో గడ్డను పూర్తిగా తొలగించి, నమూనాను హిస్టోపాథాలజీ పరీక్షకు పంపించారు. శస్త్రచికిత్స అనంతరంరోగిని న్యూరోఐసీయూలో పర్యవేక్షణలో ఉంచగా, ప్రస్తుతం బాగా కోలుకొని ఫిజియోథెరపీ కూడా పూర్తి చేసుకున్నట్లు సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా. శ్రీనివాస్‌బొట్ల తెలిపారు. హాస్పిటల్స్‌లోని అన్నిశాఖల్లో అత్యాధునిక న్యూరోసర్జికల్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన న్యూ రోసర్జన్లు, మరియు24గంటల న్యూరోఐసీయూ సేవలు అందు బాటులో ఉన్నాయని యశోదా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్, మలక్‌పేట్, హైదరాబాద్ డైరెక్టర్ గోరుకంటిపవన్, యూనిట్ హెడ్‌కె. శ్రీనివాసరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు.

## సమిష్టిగా ఉండి క్షయ వ్యాధిని అంతం చేద్దాం!



క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

**బిజినేపల్లి, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** సమిష్టిగా ఉండి క్షయ వ్యాధినిఅంతం చేద్దామని పాలెం గ్రామసర్పంచ్ బోనాసి రామ కృష్ణ పిలుపునిచ్చారు. పాలెం గ్రామంలో శనివారం నాడు జిల్లా క్షయ వ్యాధి నిర్మూలన ప్రోగ్రాం, భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గుర్తింపు శిబిరాన్ని గ్రామపంచాయతీ దగ్గర నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి హాజరైన గ్రామస్తుల ఉద్దేశించి సర్పంచ్ రామకృష్ణ మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్మూలన అవగాహనతో, చైతన్యంతో ఉంటేనే సాధ్యమవుతుందని అన్నారు. ఒక్కరి వల్ల క్షయ వ్యాధి అంతం కాదని, చేయి చేయి కలిపి ముందడుగు వేస్తే వ్యాధిని అరికట్టగలమని తెలిపారు. అందరిలో వ్యాధి నిరోధక సామర్థ్యం కలిగి ఉన్నట్లయితే అన్నిరకాల వ్యాధులనుండి బయటపడగలమని ఆయన సూచించారు. పాలెం గ్రామం 100శాతం అక్షరాస్యత సాధించిందని, ప్రతి ఒక్కరికి వ్యాధుల పట్ల కొంతలో కొంత అవగాహన ఉందని, కుటుంబంలో ఉండే వారి పిల్లలు వ్యాధుల పట్ల, వాటి తీవ్రత పట్ల అర్థమయ్యేలా వివరించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఒక్కరితో పోయేది కాదని ఒకరు నుండి మరో 15 మందికి వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, ఇంటి పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, రోగాలను దూరం చేసే ఆరోగ్య గ్రామంగా పాలెం గ్రామాన్నినిలబెట్టాలని కోరారు. మద్యపానం, ధూమపానం, వంటి చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవాలని ఆయన సూచించారు. 110 మందికి ఛాతి ఎక్స్‌రే తీయించగా అందులో 14మందికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వారి వద్ద నుండి కళ్ళె నమూనాలను సేకరించారు. శిబిరానికి హాజరైన ప్రజలకు హెచ్ఐవి, సుఖ వ్యాధులు, షుగర్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోవిందు శ్రీనివాసులు పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డా. ప్రియాంక , భవిష్య భారత్ డా. దీప్తి, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, ఎంపిహెచ్ ఈ ఓ రాజేశ్వర్, సూపర్వైజర్లు సుజాత, శ్రీనివాసులు, శ్రవణ్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఏఎన్ఎం గజవర్ధనమ్మ, టెక్నీషియన్స్ అమన్, వీరేష్, ఆశా కార్యకర్తలు జయమ్మ, పార్వతి, విజయలీల, వరలక్ష్మి, షమీం తదితరులు పాల్గొన్నారు.

## పక్షపాతం లేకుండా సర్పంచులు తమ విధులను నిర్వహించాలి

ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో అధికారుల సూచనలు



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు,సర్పంచులు

**వీపనగండ్ల ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** ఇటీవల నూతనంగా ఎన్నికైనటువంటి గ్రామ సర్పంచులకు వనపర్తి జిల్లా కేంద్రంలో ఐదు రోజులుకలెక్టర్ ఆధ్వర్యంలో బాధ్యతలు విధులు అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గత మంగళవారం రోజు ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం శనివారం రోజు వరకు ముగిసినట్లు వీపనగండ్ల మండలంలోని 14 గ్రామ పంచాయతీల సర్పంచులు తెలిపారు ఇందులో ప్రధానంగా గ్రామంలోని ప్రతి పౌరునిపైన పక్షపాత ధోరణి అవలంబించకుండా అందరిని సమానంగా చూసే విధంగా గ్రామంలోని సమస్యలు పరిష్కరించేపందుకోసం సర్పంచులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కలెక్టర్ వివరించినట్లు వారు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచివచ్చే నిధులు ఏవైతే ఉన్నాయో వాటిని సక్రమంగా గ్రామ అభివృద్ధి కోసం వినియోగించాలని వారు సూచించినట్లు తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమానికి వీపనగండ్ల సర్పంచ్ మీసాల పార్వతమ్మ తూముకుంట సర్పంచ్ పలుస రామన్ గౌడు బొల్లారం సర్పంచ్ సుదర్శన్ రెడ్డి కల్వరాళ్ల సర్పంచ్ బండారి రాముడు సంగినేనిపల్లి సర్పంచ్ పళ్ళ జయంతి నాగర్ల బండ తండా సర్పంచ్‌గోపాల్‌నాయక్ కొర్లకుంట సర్పంచ్‌శ్రీదేవి గోపాల దిన్నె సర్పంచ్ దొడ్లకవిత రంగవరం సర్పంచ్ శివకుమార్ గోవర్ధన గిరి సర్పంచ్ ముంత జ్యోతి వల్లభాపురం సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి పుల్కర్ జర్ల సర్పంచ్ బత్తుల బాలరాజు నాగర్లబండ తండా సర్పంచ్ తదితరులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు వారు తెలిపారు. ఈ శిక్షణకార్యక్రమానికి గ్రామపంచాయతీ జిల్లా అధికారులతో పాటు వీపనగండ్ల ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నట్లు వారు తెలిపారు.

## కల్వకుర్తిలో వీధికుక్కల స్వైరవిహారం

● కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

**కల్వకుర్తి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల బెడద రోజురోజుకు పెట్రేగిపోతుంది. కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పశుపోషక జీవాలకు, సామాన్య ప్రజలకు రక్షణ లేకుండా పోతుంది. తాజాగా సిలార్పల్లి సమీపంలో కుక్కల దాడిలో దాదాపు 30గొర్రెలు మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిలార్‌పల్లి సమీపంలోని పొలంలో మేతకు వెళ్లిన గొర్రెల మందపై వీధికుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. కుక్కల దాడికి తట్టుకోలేక సుమారు 30 గొర్రెలు మృతి చెందాయి. భారీ సంఖ్యలో గొర్రెలు మృతి చెందడంతో సంబంధిత రైతుకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లింది. ఈ ఘటనతో గొర్రెల కాపరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం గొర్రెలపైనే కాకుండా, పట్టణంలోని పలు వార్డులతో పాటు సిలార్‌పల్లి, తిమ్మరాసిపల్లి ప్రాంతాల్లో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గొర్రెలతో పాటు పెంపుడు కోళ్లను సైతం కుక్కలు వేటాడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. రాత్రి వేళల్లో బైక్‌లపై వెళ్లే వారిని సైతం కుక్కలు వెంటాడుతున్నాయి. మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా కుక్కల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏబీసీ సెంటర్లు ఏర్పాటు చేసి, కుక్కల సంతతిని నియంత్రించాలని, అలాగే బాధితులకు నష్టపరిహారం అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## నేడే ఏకలవ్య గురుకుల ఎంట్రన్స్ పరీక్ష

**వెల్దండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** 5వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీసెట్) 2026 వెల్దండ మండలం గుండాల గ్రామంలోనీ ఏకలవ్య మోడల్ స్కూల్లో సర్వం సిద్ధమైనట్లు ప్రిన్సిపల్ సుమన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం11:00గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు పరీక్ష ఉంటుందని.. టీజీ సెట్ అధికారుల ఆదేశాల మేరకు పరీక్ష ప్రారంభమైన 10 నిమిషాల తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని ఆయన తెలిపారు.

## దేవాలయానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రూ.50 వేలు అందజేత



**వెల్దండ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన గుండాల శ్రీ అంబరామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగ కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకుఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి శనివారం దేవాలయానికి రూ.50వేలను ఆయన తరపున యెన్నం శ్రీకాంత్‌రెడ్డి గారిచే ఆలయ ఈవోప్రసాద్ గారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివకుమార్ శర్మ, సంతోష్ శర్మ, సురేష్ శర్మ, కృష్ణయ్య శర్మ, వీరేశంశర్మతో పాటు తదితరులు ఉన్నారు.

## ఏబీవీపీ నాయకుల హౌస్ అరెస్ట్ తగదు

■ ఏబీవీపీ నాయకులు బాల్‌రాజ్

**రాజాపూర్ ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** వాక్తాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీని అవమానించారని నిరసిస్తూ శనివారం గాంధీ భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్‌అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు హన్మగల్ల బాల్‌రాజ్, ప్రశాంత్ తదితరులు మాట్లాడుతూ..ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజాస్వామ్య యుత నిరసనలను అడ్డుకోవడం సరికాదన్నారు. అరెస్ట్ అయిన వారిలో పవన్, మణికంఠ కూడా ఉన్నారు. పోలీసుల తీరుపై ఏబీవీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎం.ఎ.ఎల్. డి కాలేజీలో అంతర్జాతీయ మాతృభాషా వేడుకలు

**గద్వాల ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ఎం ఎ ఎల్ డి డిగ్రీ కాలేజీలో వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా వేడుకల్లో అదనపు కలెక్టర్ బి. నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాలేజీలో ఏర్పాటు చేసిన తెలుగు రచయితల ఫోటో ప్రదర్శన (ఎగ్జిబిషన్) ను పరిశీలించి, తెలుగుభాష గొప్పతనాన్ని, ప్రముఖ రచయితల సాహిత్య సేవలను కొనియాడారు. అనంతరం కాలేజీ లైబ్రరీని తనిఖీ చేసి, విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు కూడా ఏర్పాటుచేయాలనియాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ కలందర్, తెలుగు అధ్యాపకులు హరి నాగ భూషణం, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై కళాజాత ప్రదర్శన



పాటలు పాడుతున్న కళాకారులు

**వీపనగండ్ల ఫిబ్రవరి21, ప్రభాతవార్త:** మండలంలోని కల్వరాళ్ల గ్రామంలోపరిసరాల పరిశుభ్రతపై వనపర్తి జిల్లా కళాకారులచే కళా ప్రదర్శన నిర్వహించి వాటి ద్వారా గ్రామంలోని పరిశుభ్రత ఎలా పాటించాలి. ఇంటి పరిసరాలుమరియు రోడ్ల త్రాగునీటి సమస్యలు తదితర వాటిపై ఏ విధంగా ప్రజలు ఉండాలి. అనే అంశాలపై కళాకారులు వారి పాటల ద్వారా ప్రజలకు వివరించి చైతన్యవంతం చేసేటందుకోసం కృషి చేయడం జరిగింది. అనే నాగర్ కర్నూల్ జిల్లా పర్యాటకశాఖ అధికారి తెలంగాణ సాంస్కృతిక సారథి కళా బృందం వనపర్తి జిల్లా టీంలీడర్ ఎన్‌సువర్ణ గుడి శివలింగం డప్పు నరసింహ డి కృష్ణయ్య ఎస్ శ్రీనివాసులు ఎం రాధా ఎం శ్రీదేవి తదితరులు కళారూపాల ప్రదర్శన ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా కస్తూర్బా గాంధీ, జడ్పీ బాలుర జడ్పీ బాలికల హై స్కూల్ నందు శనివారం హిందూవాహిని శాఖ యూత్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో గెలుపొందిన మొదటి బహుమతిని రెడ్డిచర్ల శ్రీహరి రాజు, అక్షిత కేజీబీవీ 9వ తరగతికి ఇవ్వగా రెండవ బహుమతి బి. శివకుమార్ జడ్పిహెచ్ఎస్ 9వతరగతి, మూడవ బహుమతి మహేశ్వరి జడ్పి హెచ్ఎస్ బాలికలు 9వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు హిందూ వాహిని శాఖ యూత్ వారు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజుతో పాటు అబ్దుల్ సమీర్ హిందూ వాహిని శాఖ యూత్ స్కూల్ ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

## అమిస్తాపూర్‌లో ఘనంగా ఈదమ్మ జాతర

**భూత్పూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో శనివారం ఈదమ్మ జాతరను గ్రామస్థులు పలు పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు..పట్టణ కేంద్రంలో ఈదమ్మకు భక్తులైన గ్రామస్థులు ఎద్దుల బండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐదోవార్డు కౌన్సిలర్ కెంద్యాల పద్మతో పాటు కాంగ్రెస్ నాయకులు కెంద్యాల నరేందర్, కెంద్యాల రాజేష్, మట్టి ఆనంద్, కోరె పవన్, కెంద్యాల మశ్చందర్‌తో పాటు ఆరోవార్డు బీజేపీ కౌన్సిలర్ కెంద్యాల శ్రీనివాసులు ఇతర నాయకులు, గ్రామస్థులు, మహిళలు పాల్గొన్నారు.

## సమస్యలు ఆరా తీసి..కలిసి భోజనం చేసి..

◆ పియు పిజి బాలుర హాస్టల్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన వీసీ, రిజిస్ట్రార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ పి రమేష్ బాబు, చీఫ్ వార్డెన్ మన్నెమోని కృష్ణయ్య

**మహబూబ్‌గర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ॥ జిఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ పి రమేష్ బాబు, చీఫ్ వార్డెన్ మన్నెమోని కృష్ణయ్య, న్యూ పిజి బాలుర హాస్టల్ ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. విద్యార్థులతో హాస్టల్‌కి సంబంధించిన విషయాలపై చర్చించి న్యూ పిజి బాలుర హాస్టల్ ద్వారా అందించే ఆహారం నాణ్యతగా ఉన్నాదా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చినటువంటి వారు కాబట్టి విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే నాణ్యమైనటువంటి ఆహారము తీసుకొని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతి ఒక్క రూములో వారి యొక్క టైం టేబుల్ ని ఉంచుకొనిఆ టైంటేబుల్ ఫాలో కావాలని సూచించారు. హాస్టల్లో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లైబ్రరీ మరియు ఇతర సదుపాయాలను ఉపయోగించుకొని మంచి ఉద్యోగాలు సాధించి ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొ॥ పి.రమేష్ బాబు, చీఫ్ వార్డెన్ డా. మన్నెమోని కృష్ణయ్య, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డా.సిహెచ్. రవికాంత్, న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ వార్డెన్స్ డా.ఎస్.ఎన్ అర్జున్ కుమార్, డా. ఏ.ఈశ్వర్ కుమార్, కేర్ టేకర్ వెంకటేష్, ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ 5 ఇయర్స్ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎమ్ఇడి విద్యార్థులు పాల్గొన్నారు.

## గృహప్రవేశానికి హాజరైన మాజీ మంత్రి

**శ్రీరంగాపూర్, ఫిబ్రవరి21 ప్రభాతవార్త :** శ్రీరంగాపురం మండలం కేంద్రానికి చెందిన జూనియర్ కళాశాల లెక్చరర్ కురుమూర్తి తన నూతన గృహప్రవేశం శనివారం రోజు జరిగింది. ఈ గృహప్రవేశానికి బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై కురుమూర్తికి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కురుమూర్తి మాట్లాడుతూ తన గృహప్రవేశానికి ముఖ్య అతిథులుగా వచ్చినందుకు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి కృతజ్ఞతలుతెలియజేయడం జరిగింది. ఈ గృహప్రవేశంలో సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితోపాటు మండల టిఆర్ఎస్ నాయకులు పాల్గొనడం జరిగింది.

## రాజాపూర్ సర్పంచుల సంఘం మండల కమిటీ ఎన్నిక

**రాజాపూర్, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** రాజాపూర్ మండల సర్పంచుల సంఘం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్పంచుల సంఘం మండల అధ్యక్షులుగా రాజాపూర్ గ్రామ సర్పంచ్ కావలి రామకృష్ణను ఎన్నుకోగా, సర్పంచుల సంఘం మండల ఉపాధ్యక్షులుగా సింగమ్మగూడ తాండ సర్పంచ్ రాఘవేందర్ నాయక్‌ను ఎన్నుకున్నారు. అలాగే సర్పంచుల సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా చెన్నవెల్లి గ్రామ సర్పంచ్ పానుగంటి యాదగిరిని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తమ ఎన్నిక కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, సర్పంచుల సమస్యల పరిష్కార విషయంలో ఎప్పుడు ముందుంటామని, గ్రామాల అభివృద్ధే తమ వంతుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## చిక్కరగుట్ట తండా గ్రామపంచాయతీలో ఆరోగ్య శిబిరం

**ధన్వాడ, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** ధన్వాడ మండలంలోని చిక్కరగుట్ట తండా గ్రామపంచాయతీలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరానికి గ్రామస్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 150 మంది గ్రామస్తులు శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో వైద్యులు రక్తపోటు, షుగర్ పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పరిశుభ్రత, పోషకాహారం, వ్యాధి నివారణ చర్యల గురించి సూచనలు ఇచ్చారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇలాంటి ఆరోగ్య శిబిరాలు తరచుగా నిర్వహించాలని కోరారు. గ్రామ ప్రజలకు దగ్గరలోనే వైద్య సేవలు అందించడం వల్ల ఎంతో ప్రయోజనం కలిగిందని వారు తెలిపారు.

## అన్నాసాగర్‌లో ఘనంగా కోటమైసమ్మ, భూలక్ష్మి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ట

**భూత్పూర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో శనివారం కోటమైసమ్మ, భూలక్ష్మి అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి ఇతర నాయకులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్స్‌కి రూ.3 లక్షల చెక్కు అందజేత

**జంగం విశ్వనాథను అభినందించిన పియు ఉపకులపతి శ్రీనివాస్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న డా. జంగం విశ్వనాథ్ విశ్వవిద్యాలయనికి మూడు లక్షల రూపాయల చెక్కును యూనివర్సిటీ సైకాలజీ విభాగంలో అత్యధిక మార్కులు సాధించిన విజేతలకు కాన్వకేషన్ ( స్నాతకోత్సవం)లో ఇచ్చే గోల్డ్ మెడల్‌కు సంబంధించి వైస్ ఛాన్సలర్ కె.శ్రీనివాస్‌కి అందజేశారు. ఆయన గత సంవత్సరం కూడా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు రూ.3.5 లక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ రమేష్ బాబు, అదేవిధంగా కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రవీణ, ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డా. కర్ణాకర్ రెడ్డి, విభాగాధిపతి డా. ఆంజనేయులు ఆచార్యులు డా. బషీర్ అహ్మద్, డా. జయ నాయక్, డా. విజయలక్ష్మి, బోధనతర సిబ్బంది నందిని, శివ రాములు, బుర్రన్న పాల్గొన్నారు.

## పిచ్చి మొక్కలను తొలగించాలి

◆ బాల భవన్ వస్తువులను దుర్వినియోగం చేయొద్దు

◆ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** బాల భవన్ పరిసరాల చుట్టూ పరిశుభ్రత పాటించాలని ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మహబూబ్ నగర్ పట్టణంలోని బాల భవనం ను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. అక్కడ వృధాగా పెరిగిన మొక్కలు, చెత్త తొలగింపుచేయాలని మహబూబ్‌నగర్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే బాల భవన్ వస్తువులు దుర్వినియోగం కాకుండా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్‌ను ఆదేశించారు.



# నిరుపేదల పెన్నిధి కాంగ్రెస్ ప్రభుత్వం

◆ ఎవరైనా డబ్బులు అడిగితే నాకే ఫిర్యాదు చేయండి ◆ కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో మంత్రి జూపల్లి



కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన లబ్ధిదారులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎవరైనా డబ్బులు అడిగితే సహించేది లేదని, నేరుగా నాకు ఫిర్యాదు చేయండి అన్ని స్పష్టం చేశారు. శనివారం కొల్లాపూర్‌లో మంత్రి క్యాంప్ కార్యాలయంలో నియోజకవరానికి చెందిన 180 మంది లబ్ధిదారులకు రూ.1.81 కోట్ల కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను మంత్రి జూపల్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పేద ప్రజలకు అండగా ఉంటూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఆడపిల్ల పెళ్లిలకు మేమున్నామని భరోసా ఇస్తూ ప్రభుత్వం పేదింటి అడబిడ్డలకుటుంబాల్లో వెలుగులు నింపేందుకు కళ్యాణలక్ష్మి, షాదీము బారక్ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మితిమీరిన అప్పుల వల్ల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. ఏది ఏమైనా, అందరికీ సమానన్యాయం చేయడం, నిరుపేదల కుటుంబాలు వెలుగులు నింపడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకు పోతున్నదని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమం అభివృద్ధిపై దృష్టి సారించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అన్నారు. ప్రతి ఇంటికి ఇల్లాలే వెలుగని, మహిళలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10 లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు, రూ.500లకే గ్యాస్‌సిలిండర్, పేదల కుటుంబాలకు 200 యూనిట్ల వరకుఉచితంగా విద్యుత్ అందుతున్నాయన్నారు. ఉచితబస్సు సౌకర్యం ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేస్తున్నా మని తెలిపారు. రైతుల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఉచిత విద్యుత్, సాగునీరు, పెట్టుబడి సహాయం, మద్దతు ధర వంటి వాటిని ప్రవేశపెట్టి రైతులకు ఇబ్బంది లేకుండా ప్రజా ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు.

## గిరిజనులు సంతు సేవాలాల్ మార్గాన్ని పాటించాలి : మంత్రి జూపల్లి కృష్ణారావు



సంతు సేవాలాల్ జయంతి వేడుకల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి గిరిజనబిడ్డ సంతు సేవాలాల్ మార్గాన్ని ఆచరించాలని, అది విద్యతోనే సాధ్యమవుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని సేవాలాల్ భవన్ లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు తండాల నుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరయ్యారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కొల్లాపూర్ మాధవ స్వామి గుడి నుండి కొల్లాపూర్ ఈదమ్మ రోడ్డు మార్గం గుండా సభ స్థలం వరకు గిరిజనులతో కలిసి



ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి సేవాలాల్ మహారాజ్ మరియు మేరమ యాడి దేవతకు మహాబోగ్ (హోమం) నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా హోమంలో నెయ్యి, కడావ్ వేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ బంజారా సమాజ ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయమనిఅన్నారు. శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గిరిజన తండాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు చదువుకున్న వారు సహకరించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని మంత్రి తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో లైబ్రరీలను ఏర్పాటు చేసి ప్రజలలో పఠన సంస్కృతిని పెంపొందించడంతో పాటు, వారి జ్ఞానాన్ని విస్తరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వాతావరణాన్ని బలోపేతం చేయడం ద్వారా సమాజ అభివృద్ధికి పటిష్టమైన పునాది వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మనుషులు ఊపిరి ఉన్నంతవరకు విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించాలనిమంత్రి సూచించారు. జీవితంలో నైతిక విలువలు, నిజాయితీ, క్రమశిక్షణ వంటి గుణాలు వ్యక్తిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని అన్నారు. గిరిజన ప్రాంతానికి సంబంధించిన పెండింగ్ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. సంత్ సేవాలాల్ మహారాజ్‌ను కొలిచేందుకు కొల్లాపూర్ నియోజకవర్గంలో మంచి స్థలాన్ని ఎంపిక చేసి ఆమహనీయుడి గుడిని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత మానసిక నిపుణులు డా.లక్ష్మణ్, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి వివిధ శాఖల అధికారులు వివిధ గిరిజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

◆ బిజెపి రాష్ట్ర నాయకులు లక్ష్మీకాంత్ రెడ్డి



విజయం సాధించిన బిజెపి ప్రజా ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన బిజెపి కౌన్సిలర్లు గత నెలలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బిజెపి కార్యాలయంలో ఇటీవల విజయం సాధించిన బిజెపి కౌన్సిలర్లను మరియు గత నెలలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఉపసర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బిజెపిపార్టీపై నమ్మకంఉంచి విజయాన్ని కట్టబెట్టిన ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేయాలని ఈ విషయంపై మహబూబ్నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ సహాయ సహకారాలతో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకుకేంద్ర ప్రభుత్వం విధులు విడుదల చేస్తున్న విషయాన్ని ప్రజలకు వివరించాలని అంతేకాకుండా మున్సిపల్ కేంద్రాలలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మంచినీటి పనుల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని ఆయన అన్నారు. దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అవినీతికి తావివ్వకుండా పాలన కొనసాగిస్తున్న విషయాన్ని బిజెపి ప్రజా ప్రతినిధులు గ్రహించి ప్రజలకు చేరువ ఎందుకు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా కలయాపన చేస్తున్న విషయాన్ని ఇప్పటికప్పుడు నిలదీస్తూ అధికారులను మరియు ప్రజాప్రతినిధులను ఇక్కడిక్కడ నిలదీసేందుకు సన్నద్ధం కావాలన్నారు. మున్సిపల్ మరియు పంచాయతీ ఎన్నికల్లోవిజయం సాధించిన విధంగానే రాబోయే ఎంపీటీసీ మరియు జెడ్పిటిసి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులను గెలిపించుకునేందుకు తాను ఎల్లవేళలా కిందిస్థాయి నాయకులకు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకు ముందుగా ఆత్మకూర్ బిజెపి మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ మాట్లాడుతూ గతంలో జరిగిన ఎన్నికల్లో మాదిరి కాకుండా ఈసారి జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ మరియు టిఆర్ఎస్ పార్టీలను పక్కకు నెట్టేస్తూ పట్టణాలలో బిజెపి ఓటు బ్యాంకు పెంచుకున్న విషయాన్ని కార్యకర్తలు గుర్తించి ప్రజల సమస్యల కోసం ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల బిజెపి అధ్యక్షులు అశోక్ భూపాల్ యాదవ్ మక్తల్ నియోజకవర్గం బిజెపి నాయకులు రేచింతల శ్రీనివాస్ అనపర్తి జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు ముదిరాజ్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆత్మకూరు పట్టణ బిజెపి అధ్యక్షులు సురేష్ ఉప సర్పంచ్ ఎల్లన్న ఎద్దుల రాజు తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూమి

**అన్యాక్రాంతమైనటువంటి భూమిని పరిశీలించిన తహసీల్దార్**



అన్యాక్రాంతమైనటువంటి భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ వరలక్ష్మి

**వీపనగండ్ల ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కేంద్రంలో ఉన్న 721 సర్వేనెంబర్ లోని భూమి కబ్జాలకు గురవుతున్న చూస్తూ ఉంటున్నారు. తప్ప పరిష్కరించడానికి చొరవ చూపడం లేదని విమర్శలు రెవెన్యూ అధికారుల పైన వస్తున్నాయి. గత 50 సంవత్సరాల కిందట వీపనగండ్ల గ్రామ ప్రజలు 721 సర్వే నెంబర్‌లో 16ఎకరాల 20గుంటను ప్రభుత్వానికి అప్పజెప్పారు. అందులో అప్పట్లో ప్రభుత్వ భూమి ఉండగా రైతులు కల్లాలు వేసుకొని పశువులను కట్టేసుకొని ఉండేవారు అప్పట్లో వీపనగండ్లకు మండలం వస్తుంది అనే ఆలోచనతో ఆభూమిని దొడ్లు తొలగించుకొని రైతులు ఫ్రీగా ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది అయితే ప్రస్తుతానికి వచ్చేసరికి ఆ భూమి రెవెన్యూ అధికారులు సరిగ్గా పర్యవేక్షణ లేకపోవడం వల్ల కబ్జాలకు గురవుతూ దాదాపు,1.31 గుంట అన్యాక్రాంతం కాకకొంత భూమిలో ఇండ్లుకట్టుకున్నారు. ప్రభుత్వ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండానే ఈ రకంగా మొత్తము నాలుగెకరాల భూమి అన్యాక్రాంతం అయిందని ప్రజలు గ్రామస్తులు అంటున్నారు. అయితే ఇట్టి భూమిని గతంలో కలెక్టర్ ఆదేశాల ప్రకారం అన్యాక్రాంతమైనటువంటి దాన్ని కొలతలు చేసి భూకబ్జాలో ఎవరెవరున్నారని తేల్చిన వాటిని మాత్రం ఆ కబ్జా నుండి తొలగించలేదు. ఇది కామేనా ఈ రకంగా కొందరు భూమిని ఆక్రమించుకుంటుంటే మేము స్వచ్ఛందంగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మాణం కోసమని వదిలిన భూమిని కబ్జాలు చేస్తున్నారని గ్రామ యువకులు ఆరోపిస్తున్నారు. ఆ రకంగా ఉన్న ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తూ ఉంటున్నారని కొందరు ఆ భూములను ఆకుపై చేసుకొని అనుభవిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు దానితో గ్రామ యువకులు కలిసికట్టుగా కొందరి ఫ్రీగా వదిలినటువంటి భూమిని అనుభవిస్తుంటే మాకు ఎందుకులేదు అని ఎవరికి వారు కబ్జాలు చేసుకొని నాకుఈ స్థలంనాకు ఈ స్థలంఅని కంచెలు వేసుకుంటున్నారు. ఇది శనివారం నాడు జరిగింది దీన్ని పరిష్కారం కోసం తహసిల్దార్ వరలక్ష్మి కంచెలివేసిన స్పాట్ మీదికి వెళ్లి పరిశీలించారు. ఎవరెవరైతే కబ్జాలకు గురిచేశారోఅట్టి భూములను నోటీసుల ద్వారా వారిని తొలగించడానికి ప్రయత్నం చేస్తామని ఆమె చెప్పుకొచ్చారు. అయితే తక్షణమే కబ్జాకు గురైనటువంటిప్రభుత్వభూమినికాపాడాలని వీపనగండ్ల గ్రామస్తులు కోరుతున్నారు.

## చిన్న పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలి



ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:** చిన్న పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని జీఎం డీఐసీ యదయ్య అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిశ్రమల శాఖలోని ఈడీసీ ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్య భవనంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జీఎం డీఐసీ యదయ్య పథకానికి సంబంధించిన పూర్తి వివరాలను వివరించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్ బ్యాంకు రుణాల పొందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే జన శిక్షణ సమితి డైరెక్టర్ సుబ్బారెడ్డి నైపుణ్యాభివృద్ధి మార్కెటింగ్ అంశాల గురించి అవగాహన కల్పించారు. చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం డీఐసీయదయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, జన శిక్షణ సమితి డైరెక్టర్ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ డీపీఎం రామమూర్తి, డీఆర్‌డీఏ ఏపీఎం రమణ, ఈడీసీ మేనేజర్ మహబూబ్ అలీ, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, 38 మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ సాధించిన అమ్తుల్ ఫాతిర్ ఫర్హీన్

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి21 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి అమ్తుల్ ఫాతిర్ ఫర్హీన్ తన పిహెచ్‌డి ని విజయవంతంగా పూర్తి చేశారు. ఆమె పిహెచ్.డి పరిశోధన "తెలంగాణలోని మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థలలో ఇంగ్లీష్ భాష నేర్చుకోవడంలో హైస్కూల్ స్థాయిలో నాన్‌ఇంగ్లీషు మీడియం ముస్లిం మైనారిటీ విద్యార్థుల సమస్యలపై ఒక అధ్యయనం" అనే శీర్షికతో ఉంది. ఈ పరిశోధన సమ్మిళిత భాషా విద్య పట్ల ఆమె నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఫర్హీన్ తార్నాకలోని సెయింట్ ఆన్స్ హై స్కూల్‌లో ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్, సరోజినీ నాయుడు వనితా మహావిద్యాలయంలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి విద్యలో మాస్టర్స్ పూర్తి చేసింది. ఆమె ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి దూరవిద్య నుండి మనస్తత్వ శాస్త్రం, ఆంగ్లంలో ఎంఏ డిగ్రీని కూడా పొందారు. ఇంగ్లీష్, విద్య రెండింటిలోనూ సెట్ అర్హత సాధించారు. మార్గదర్శకత్వం చేసిన తన పరిశోధన పర్యవేక్షకురాలు ప్రొ॥ జి.మనోజకు, నిరంతర ప్రోత్సాహాన్ని ఇచ్చిన హెచ్‌ఓడి ప్రొ॥ మాళవికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన తల్లిదండ్రులు, కుటుంబం, మార్గదర్శకులు, ప్రయాణంలో తనకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఎదురెదురు బైకులు ఢీకొని వ్యక్తికి గాయాలు

**చిన్నంబావి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నమార్ క్రాస్ రోడ్ దగ్గర రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని తీవ్ర గాయాలైన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఘటనలో ఢీకొట్టిన వ్యక్తి అక్కడి నుంచి పరారు అయ్యాడు. కాగా మరొక బైక్ పై ఉన్న గోప్లాపూర్ గ్రామానికి చెందిన గొల్ల రామచంద్రుడికి తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వస్తున్న కొందరు ప్రయాణికులు108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని హుటాహుటిన కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది. అంబులెన్స్ సిబ్బంది టెక్నీషియన్ నరేందర్ ఫైలెట్ రాఘవేంద్ర తెలియజేశారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పల్లె ప్రకృతి వనంపై పంజా



ప్రకృతి వనంలో చెట్లను తొలగించిన దృశ్యం

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు 200 చెట్లను జెసిబి సాయంతో తొలగించడంతో గ్రామస్తులు ఆందోళన చెందారు. అధికారుల అనుమతి లేకుండా, చెట్లను తొలగించి అక్కడ ఏం చేస్తారో కనీస సమాచారం లేకుండా ఎవరికీ తెలియకుండా ఇష్టారీతిగా వ్యవహరించడంపై అధికారులకు సమాచారం అందించారు. చెట్లను తొలగించే ఫోటోలు వీడియోలు సైతం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చెట్లను తొలగించే పనులు మధ్యలో నిలిపివేసినట్లు సమాచారం. ఇదే విషయమై దేవరకద్ర ఎంపీడీవోను వివరణ కోరగా తనకు సమాచారం అందింది అని వెంటనే పనులు నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాజేందర్ ను చెట్ల నరికివేత పై అనుమతి ఉందా అని సమాచారం కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని అనుమతి లేకుండా చెట్లను తొలగించడం నరికివేయడం చట్టరీత్యా నేరం అని తెలిపారు. ఆదివారం గ్రామానికి వెళ్లి విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

(మొదటి పేజీ తరువాయి)

ఇదే పాఠశాలలో చదువుకున్నానని, కృతజ్ఞతాభావంతో ఈ సేవ చేపట్టానన్నారు. ఇది సేవ కాదని, తన బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు నడుచుకుంటూ పాఠశాలకు వస్తుండటం చూసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. 2024లో నిర్ణయం తీసుకుని, అన్ని నిబంధనలు పూర్తి చేసి 2026లో బస్సు అందించగలిగినట్లు చెప్పారు. విద్యాశాఖ అధికారి గోవిందరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత బస్సు కల్పించిన జిల్లాల్లో నారాయణపేట రెండవ స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఆర్టీవో మేఘాగాంధీ, తహసిల్దార్ చింతరవి, ఎంపీడీవో కిషోర్‌కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. జిల్లా పరిపాలన తరఫున కలెక్టర్ స్వామీజీ దాతృత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.